నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, బుధవారం 24 జూలై 2024 | YADADRI BHUVANAGIRI



కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు నిరాశే ఎదురైంది. పలు ప్రాజెక్ట్‌లు, ఇనిస్టిట్యూషన్లపై ఆశలు పెట్టుకున్నా అడియాశలుగానే మిగిలిపోయాయి. పోచంపల్లికి ఐఐహెచ్‌టీ, మునుగోడు ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్, ఎంఎంటీఎస్, హైదరాబాద్-విజయవాడ హైస్పీడ్ రైలు, భువనగిరి ఖిలా అభివృద్ధి, సీసీఎంబీ, విద్యాసంస్థలు తదితర అనేక ప్రతిపాదనలు ఉన్నా ఆఖరికి గుండు సున్నానే మిగిలింది. మరోవైపు కేంద్ర బడ్జెట్‌పై ప్రజలు పెదవి విరుస్తున్నారు. పన్నులు మినహాయింపు లేదు, పెట్రో, గ్యాస్, నిత్యావసరాల ధరల భారంపైనా ఊరట లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యాదాద్రి భువనగిరి, జూలై 23 (నమస్తే తెలంగాణ) :

కేంద్ర బడ్జెట్‌లో నిరాశే..

ఉమ్మడి జిల్లాపై కరుణ చూపని నిర్మలమ్మ

- కొత్త ప్రాజెక్ట్ ఒక్కటీ రాలే.. నిధులూ విదిల్చలే..
- ఎప్పటిలాగే పోచంపల్లి ఐఐహెచ్‌టీకి మొండిచెయ్యి
- మునుగోడు ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్‌ను పట్టించుకోలే
- కేంద్ర విద్యా సంస్థల మంజూరు ఊసే లేదు
- ఉసూరుమన్న ఖిలా భువనగిరి, సీసీఎంబీ ప్రాజెక్ట్‌లు
- పరిగణలోకి తీసుకోని రైల్వే ప్రాజెక్టుల ప్రతిపాదనలు
- హైదరాబాద్-విజయవాడ హైస్పీడ్ రైలూ అంతే..
- పెట్రో, గ్యాస్, నిత్యావసర ధరల భారంపై కలిగించని ఊరట

పోచంపల్లికి ఐఐహెచ్‌టీపై స్పష్టతేది..?

భూదాన్ పోచంపల్లి చేనేత చీరలకు పెట్టింది పేరు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో గుర్తింపు పొందింది. ఇక్కడ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏర్పాటు చేయాలని ఎన్నో ఏండ్ల నుంచి డిమాండ్ ఉంది. ఇదే విషయంపై మాజీ మంత్రి కేటీఆర్ సైతం కేంద్రానికి పలుసార్లు విజ్ఞప్తులు చేశారు. ఇక్కడ ఇనిస్టిట్యూట్ ఏర్పాటుకు అన్ని సదుపాయాలు కూడా ఉన్నాయి. కానీ దీనిపై కేంద్రం బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ ఏ మాయే..?

ప్రపంచంలో అత్యధికంగా ఫ్లోరైడ్ బాధితులు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే ఉన్నారు. వందలు, వేల మంది ఫ్లోరైడ్‌తో కాలం వెల్లదీస్తున్నారు. గతంలోనే చౌటుప్పల్‌లో ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ మంజూరైంది. కానీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పశ్చిమ బెంగాల్‌కు తరలించుకుపోయింది. రీసెర్చ్ సెంటర్ వస్తే.. అధ్యయనాలు జరుగుతాయి. సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తాయి. మునుగోడు ఉప ఎన్నికల సమయంలోనూ ఫ్లోరైడ్ రీసెర్చ్ సెంటర్ మంజూరు చేస్తామని బీజేపీ అగ్ర నేతలు, కేంద్ర మంత్రులు హామీలు ఇచ్చారు. కానీ అది ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

ఖిలా భువనగిరికి నిధులేవి..?

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఉన్న భువనగిరి ఖిలాకు ఎప్పుడూ మొండి చెయ్యే ఎదురవుతున్నది. ఎన్నో బడ్జెట్‌లు వస్తున్నాయి.. పోతున్నాయి.. కానీ నిధులు మాత్రం విడుదల చేయడలేదు. స్వదేశీ దర్శన్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేశారని చెబుతున్నా నిధులు మాత్రం విడుదల చేయలేదు. ఇటీవల ప్రధాని మోదీని వర్చువల్‌గా శంకుస్థాపన చేసినా.. నిధులు రాకపోవడంతో ఖిలా అభివృద్ధి ముందుకు సాగడం లేదు.

మరికొన్ని ఇలా..

- ప్రతిష్టాత్మక రీజినల్ రింగ్ రోడ్డు (త్రిపుల్ ఆర్)కు నిధులు కేటాయించలేదు.
- హైదరాబాద్-విజయవాడ త్రిబుల్ లైన్‌కు నిధులను ప్రతిపాదించ లేదు.
- భువనగిరి -రాయగిరి-ఆలేరు- జనగామ మధ్య నడిచే పుష్‌పుల్ రైలు ట్రిప్పులు పెంచాలనే వినతిని గాలికొదిలేశారు.
- రాయగిరి, భువనగిరి రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, పలు రైళ్ల హాల్ట్‌ను పరిగణలోకి తీసుకోలేదు.
- మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు నిధులు పత్తాలేవు.

కొత్త సంస్థలూ ఇయ్యలే..

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి విద్యా సంస్థలు మంజూరు చేయలేదు. కొత్తగా ఏర్పాటైన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు జవహర్ నవోదయ పాఠశాలలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ ఏ జిల్లాకూ మంజూరు కాలేదు. భువనగిరిలోని బొమ్మాయిపల్లిలో 120 ఎకరాల్లో సీసీఎంబీ ఏర్పాటు చేస్తామని ఏడేండ్ల క్రితమే ప్రతిపాదలు పంపించినా ఉలుకూ పలుకూ లేదు. ఇక భువనగిరి ఇండస్ట్రియల్ పార్క్, దండు మల్కాపురంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ను పరిగణలోకి తీసుకోలేదు. భువనగిరి- రాయగిరిలో ఎనిమిది లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ప్రతిపాదనలు ఉన్నా పట్టించుకోలేదు.

రైల్వే ప్రాజెక్టులపై నో క్లారిటీ..

గతంలో రైల్వే బడ్జెట్ ప్రత్యేకంగా ప్రవేశపెట్టేవారు. కానీ ఎన్‌డీఏ ప్రభుత్వం గత నాలుగైదు సంవత్సరాలుగా కేంద్ర బడ్జెట్‌లోనే కలిపేసింది. దాంతో రైల్వే బడ్జెట్ కేటాయింపుల్లో కాస్త గందరగోళం నెలకొంటున్నది. పింక్ బుక్ వస్తే తప్ప.. ఏం వచ్చాయో.. రాలేదో చెప్పలేని పరిస్థితి. బుధవారం లేదా గురువారం పూర్తి స్థాయి సమాచారం వచ్చే అవకాశం ఉంది. హైదరాబాద్- విజయవాడకు హైస్పీడ్ రైలు ప్రతిపాదలు ఎప్పటి నుంచో ఉన్నది. ఎంపీలు చెబుతున్న సమాచారం ప్రకారం దీనిపై ఎలాంటి స్పష్టత లేదు. ఘట్‌కేసర్ నుంచి రాయగిరి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు డిమాండ్‌ను పట్టించుకోలేదు. బీబీనగర్-నడికుడి డబ్లింగ్, ఎలక్ట్రిఫికేషన్‌కు నిధులు కేటాంచాల్సి ఉంది.

మరోసారి రైతులను మోసం చేసిన కేంద్ర ప్రభుత్వం

2024-25 సంవత్సరానికి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులు, వ్యవసాయ రంగాన్ని పూర్తిగా మోసం చేసే విధంగా ఉన్నది. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టేందుకు పూనుకున్నది. రైతు వ్యతిరేకంగా ఉన్న ఈ బడ్జెట్‌ను సవరించాలి. రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు ఈ బడ్జెట్‌లో పూనుకోలేదు. పైగా ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టేందుకు ఉపక్రమించింది. 14 వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరను పెంచామని ఆర్థిక మంత్రి ప్రకటించారు కానీ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలి. కొనుగోలుకు చట్టబద్ధత కల్పించాలి. కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం దేశంలో సగం మందికి పైగా ఉపాధిని చూపిస్తున్న వ్యవసాయ రంగానికి సరిపడా నిధులు కేటాయించలేదు. సహకార రంగాన్ని బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నది. ఆహార సబ్సిడీగానీ, వడ్డీమాఫీ పథకానికిగానీ, వ్యవసాయ పరిశోధనలకు గానీ పెరిగిన బడ్జెట్‌కు అనుగుణంగా నిధులు పెంచలేదు. వడ్డీమాఫీ పథకానికి 2022-23లో రూ.23వేల కోట్లు ఖర్చు చేస్తే, ఇప్పుడు రూ.22,600 కోట్లు మాత్రమే కేటాయించింది. రీసెర్చ్ కోసం 2022-23లో రూ.1,836 కోట్లు ఖర్చుచేస్తే ఇప్పుడు రూ.1200 కోట్లు మాత్రమే కేటాయించింది. రీసెర్చ్ మొత్తాన్ని కార్పొర్పొరేట్ కంపెనీలకు అప్పజెప్తున్నారు. పంటల బీమా పథకంలో కూడా నిధులకు కోత పెట్టారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని బీమా కంపెనీలకు కాకుండా రైతాంగానికి ఉపయోగపడే విధంగా మార్చాలన్న రైతుల డిమాండ్ నెరవేర్చే ప్రయత్నం చేయలేదు. రైతులకు పెన్షన్ ఇవ్వాలన్న డిమాండ్‌ను కూడా పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రానికి విభజన హామీలు ఏ ఒక్కటి అమలు చేసేందుకు సిద్ధపడలేదు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు కేంద్రంపై ఒత్తిడి చేయాలి. కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిపై జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలియజేయాలని రైతాంగాన్ని కోరుతున్నా.

-మాటూరి బాలరాజుగౌడ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి (భువనగిరి కలెక్టరేట్)

మెరుపులు లేని సాధారణ బడ్జెట్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంచలన విషయాలు ఏమీ లేవు. ఉన్నంతలో అందరినీ సంతృప్తి పర్చడానికి కృషి చేసినట్లు కనపడుతుంది. ముఖ్యంగా మధ్య తరగతి ఉద్యోగస్తులు, వేతన జీవులకు ఎలాంటి భారం కలిగించకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నట్లుగా ఉన్నది. ఇన్‌కమ్‌ట్యాక్స్ స్లాట్‌ని మూడు లక్షల ఆదాయం మించి ఉన్న వాళ్లు కూడా ఐదు శాతం చెల్లించాలన్నది నిరుత్సాహకరమైన అంశం. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50వేల నుంచి రూ.75వేలకు పెంచడం కొంత నయం. పారిశ్రామిక కారిడార్లు ఏర్పాటు చేయడం, ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి తోడ్పాటు అందించడం, ముద్ర రుణాలపై పరిమితిని రూ.10 లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచడం, బంగారం, వెండి పైన ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించడం, సెల్‌ఫోన్‌లు, కంప్యూటర్‌లపై సుంకం తగ్గించడం వల్ల వాటి ధరలు తగ్గుతాయి.

-పెద్దిరెడ్డి గణేశ్, బ్యాంకింగ్ రంగ నిపుణుడు, సూర్యాపేట

బడ్జెట్‌లో ఉపాధి హామీకి తగ్గిన కేటాయింపులు

కేంద్ర బడ్జెట్‌లో గ్రామీణ ఉపాధి పథకానికి రూ. 86 వేల కోట్లు కేటాయించారు. 2023-24లో ఉపాధి హామీ చట్టానికి రూ. 86 వేల కోట్లు కేటాయించగా రూ. 1,05,000 కోట్లు ఖర్చు అయ్యింది. అంటే గత సంవత్సరంలో అయిన ఖర్చుతో పోలిస్తే ఈ సంవత్సరం రూ. 19,300 కోట్లు తక్కువగా కేటాయింపులు జరిగాయి. ఇది పూర్తిగా ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేయడమే. పని కోరిన ప్రతి జాబ్‌కార్డుదారుడికి వందరోజుల ఉపాధి దొరికే విధంగా బడ్జెట్ కేటాయించాలి.

- సురపంగ శివలింగం, రాష్ట్ర కన్వీనర్, ప్రజా పర్యవేక్షణ కమిటీ (యాదగిరి గుట్ట)

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజా వ్యతిరేకమైనది. వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదలకు మేలు చేసేదేమీ లేదు. ఆహార ఉత్పత్తి ధరలు 3.8 నుంచి 7.5శాతానికి పెరిగాయి. ఆహార భద్రతకు ఈ బడ్జెట్‌లో 2వేల కోట్ల రూపాయలు తగ్గించింది. గ్రామీణ ప్రాంతంలో 70శాతం ఉన్న ఉపాధి కూలీలకు 86వేల కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది. ఉపాధి హామీకి రెండు లక్షల కోట్ల రూపాయలు కేటాయించాల్సి ఉంది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గత సంవత్సరం 54వేల కోట్ల రూపాయలు కేటాయించగా 32వేల కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేశారు.

-సైదులు, వ్యవసాయ కార్మిక సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట

ఇన్‌కమ్ ట్యాక్స్ స్లాబుల మార్పుతో తగ్గనున్న జీరో మనీ

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఇన్‌కమ్‌ట్యాక్స్ స్లాబులను పెంచడం ద్వారా జీరో మనీని మరింత కట్టడి చేయొచ్చు. గతంలో రూ.10 లక్షల ఆదాయం దాటితే 30 శాతం ట్యాక్స్ ఉండగా కొత్త మార్పుతో రూ.15 లక్షల ఆదాయం పైన ఉంటేనే 30 శాతం ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుంది. స్టాండర్డ్ డిడక్షన్ రూ.50 వేల నుంచి రూ.75వేలకు పెంచడం ద్వారా ఉద్యోగస్తులకు ఊరట లభిస్తుంది. గతంలో షార్ట్ టర్మ్ కాపిటల్ గెయిన్స్ స్లాబ్ ప్రకారం 20శాతం వరకు ట్యాక్సేషన్ ఉండగా ఇండక్సేషన్ ఎత్తివేయడం ద్వారా స్లాబ్‌తో సంబంధం లేకుండా 12.5 శాతం చేయడం అనేది మంచి నిర్ణయం.

- బ్రహ్మదేవర సోమయ్య, చార్టర్డ్ అకౌంటెంట్, సూర్యాపేట

మనకు నిరాశే మిగిలింది

రూ.48.21 లక్షల కోట్లతో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ తెలంగాణ రాష్ట్రాన్ని నిరాశపర్చింది. ఎన్‌డీఏ ప్రభుత్వ అనుకూల రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, బిహార్, ఒడిశాకు వరాల జల్లు కురిపించారు. పది సంవత్సరాల నుంచి మధ్య తరగతి ఉద్యోగులు ఆశిస్తున్నట్లుగా ట్యాక్స్ రిడక్షన్ రూ.5 లక్షలు నుంచి 7 లక్షలు పెంచకపోవడం నిరాశ. కేవలం స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.50 వేల నుంచి 70 వేలకు మాత్రమే పెంచారు. రాష్ట్రాలకు 50 సంవత్సరాల వడ్డీలేని రుణ సౌకర్యం కల్పించారు. కస్టమ్స్ డ్యూటీలు తగ్గించారు. అన్‌లైన్ వస్తువులు, కొనుగోలు ధరలు తగ్గే అవకాశం ఉంది. వ్యవసాయ పరిశోధనా రంగానికి ప్రాధాన్యత, ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం, పంటలకు మద్దతు ధరలు ప్రకటించడం స్వాగతించదగ్గ అంశాలు.

-బడుగుల సైదులు, ఆర్థిక సామాజిక విశ్లేషకుడు, కోదాడ

అసెంబ్లీలో మన ఎమ్మెల్యేలు

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మంగళ వారం ప్రారంభం కాగా ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శాసన సభ సమావేశాలకు వస్తున్న దృశ్యమిది.

రైతుల రుణాలను రెన్యూవల్ చేయాలి

- బ్యాంకు అధికారులకు కలెక్టర్ ఆదేశం

యాదగిరిగుట్ట ఏపీజీవీబీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

యాదగిరిగుట్ట, జూలై 23 : రుణమాఫీ మంజూరైన రైతుల రుణాలను తిరిగి రెన్యూవల్ చేయాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే బ్యాంకు అధికారులను ఆదేశించారు. యాదగిరిగుట్ట పట్టణంలోని ఏపీజీవీబీ, యూనియన్ బ్యాంకులను మంగళవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించి రుణమాఫీ జరుగుతున్న విధానాన్ని బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్షలోపు రుణమాఫీ జరిగిన రైతులతో ఆయన మాట్లాడారు.

ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి అనూరాధ, ఎల్‌డీఎం శివరామకృష్ణ, ఏడీఏ పద్మావతి, తాసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ రాజేశ్‌కుమార్, ఆర్ఐ విజయసింహారెడ్డి, ఏఈఓలు ఉన్నారు.

సీఎం సార్.. యాది మరిచినరా?

ఏడు నెలలు కావస్తున్నా నా పిటిషన్ ఎంక్వైరీ చేయలే..

- ఉద్యోగులకు నష్టం కలుగకుండా చూస్తారని సీఎంను కలిశా
- ఒకరి దయాదక్షిణ్యాలు, మెహర్బానీ కోసమో వెంపర్లాడను
- రాష్ట్ర ప్రభుత్వం ఫండ్ ఇవ్వకపోతే కేంద్రాన్ని అడుగుతా
- మానిటరీ బెనిఫిట్స్ అన్నీ లెక్కగట్టి ఇస్తే తీసుకుంటా
- సోషల్ మీడియాలో మాజీ డీఎస్పీ దోమకొండ నళిని పోస్ట్

నళిని (ఫైల్)

యాదాద్రి భువనగిరి, జూలై 23 (నమస్తే తెలంగాణ) : 'సీఎం సార్ కొలువుకు ఎక్కగానే నన్ను, నా యాది చేసింర్రు. ఇప్పుడేమో సప్పుడు చేస్తలేరు. ఒక నెలలో నా పిటిషన్ ఎంక్వయిరీ పూర్తి చేస్తారని అనుకున్న. 7 నెలలు కావస్తున్నది. మర్చిపోయింర్రు'' అని మాజీ డీఎస్పీ దోమకొండ నళిని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు కూడా జరిగాయని, కనీసం తన ఊసే ఎత్తలేదని పేర్కొన్నారు. తన రెండు దరఖాస్తులు చెత్త కుండీలోకి వెళ్లాయనే అనుమానం వస్తున్నదని తెలిపారు. తన దరఖాస్తులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి స్పందన లేకపోవడంతో సోషల్ మీడియాలో మంగళవారం ఆమె పోస్ట్ పెట్టారు. తాను సీఎంకు రెండు విజ్ఞాపనలు ఇచ్చానని, ఒకటి సనాతన ధర్మం కోసం, రెండోది పోలీస్ సంస్కరణల కోసమని పేర్కొన్నారు. తన లాంటి కష్టం ఏ ఉద్యోగికీ కలగకుండా సీఎం చూస్తారన్న నమ్మకంతో కలిసి విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. తనకు సెక్రటేరియట్ చుట్టూ తిరిగేంత సమయం, ఓపిక లేదని ఆ రోజే రేవంత్‌రెడ్డికి చెప్పినట్లు గుర్తు చేశారు. ఒకప్పుడు ఆయన ఏబీవీపీ నాయకుడు అవడంతో ధర్మ రక్షణకు తోడ్పడుతారేమో అని భావించి డ్రీమ్ ప్రాజెక్ట్ వేద విద్యా కేంద్రానికి కూడా సాయం అడిగానని వివరించారు. అన్యమత సభలకు రూ.3కోట్లు ఇచ్చారని విన్నానని, కాబట్టి స్వధర్మం కోసం కూడా చేయగలరేమోనని అనిపించిందని చెప్పుకొచ్చారు. ఆలస్యం-అమృతం-విషం అన్నట్లు విషయాన్ని నెలల తరబడి నాన్చడం సరికాదన్నారు. ఇప్పటికే 13 ఏండ్లు గడిచిపోయాయని, ఇంకా విషయాల అంతు తేల్చకపోతే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఫండ్ ఇవ్వకపోతే కేంద్రాన్ని అడుగుతానని, వారు కూడా ఇవ్వకపోతే ధార్మికులైన దాతల ముందు జోలె పట్టి అడుక్కుంటానని తెలిపారు.

డీఎస్పీ ఉద్యోగం గురించి తనకు ఎంత మాత్రమూ ఆసక్తి లేదని, దేవాదాయ శాఖలో పోస్ట్ కూడా అవసరం లేదని ఇప్పటికే స్పష్టంగా చెప్పానని పేర్కొన్నారు. తనకు ఒకరి దయాదక్షిణ్యాలు, మెహర్బానీ కోసమే వెంపర్లాడాల్సిన అవసరం అస్సలు లేదన్నారు. రోశయ్య సాయం తనకు ఎంతటి శాపం అయ్యిందో ఎలా మరిచిపోతానని చెప్పారు. తనకు రావాల్సిన మానిటరీ బెనిఫిట్స్ అన్నీ లెక్కగట్టి ఇస్తే తీసుకోవాలని ఉందన్నారు. అందరూ తనకు పెన్షన్ వస్తుందేమోనని అపోహ పడుతున్నారని, కానీ ఇప్పటివరకు తనకు ప్రభుత్వం నుంచి నయా పైసా అందలేదని తెలిపారు. తన సర్వీస్ బుక్‌లో ఉన్న భూతం ఏంటో జర ప్రభుత్వ యంత్రాంగాన్ని తేల్చనివ్వండని తనపై విమర్శలు చేస్తున్న వారికి సూచించారు. ఎవరి పట్ల తనకు రాగద్వేషాలు లేవని, ప్రభుత్వనిర్ణయాలు ఎలా ఉన్నా స్థిత ప్రజ్ఞత కోల్పోనని చెప్పారు.

రైతులకు అందుబాటులో బత్తాయి, నిమ్మ మొక్కలు

కొండమల్లేపల్లి, జూలై 23 : మండలంలోని చిన్నఅడిశర్లపల్లి గ్రామం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కేంద్రంలో బత్తాయి, నిమ్మ మొక్కలు రైతులకు అందుబాటులో ఉన్నాయని ఉద్యాన వన పరిశోధకుడు రాజుగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాత్పుడి, రంగాపురి, నిమ్మంటుపై అంటుకంటిన బత్తాయి 15 వేల మొక్కలు అందుబాటులో ఉన్నాయని, ఒక్కో మొక్క ఖరీదు 110 రూపాయలని పేర్కొన్నారు. దీంతో పాటు బాలాజీ, పొట్లూరి పెలక్షన్ అనే రెండు నిమ్మ రకాలు మొక్క దశలో ఉన్నాయని, ఒక్కో మొక్క 50 రూపాయలని తెలిపారు. పంట్ల తోటలను సాగు చేసే రైతులు కొండమల్లేపల్లి ఉద్యానవన పరిశోధన కేంద్రానికి వచ్చి రికార్డుల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు దళారులను నమ్మి ప్రైవేట్ నర్సరీల నుంచి నాణ్యత లేని మొక్కలు తీసుకొచ్చి దిగుబడులు లేక నష్టపోవద్దని పేర్కొన్నారు. ముందుగా దరఖాస్తు చేసుకున్న రైతులకు మాత్రమే మొక్కలు అందజేస్తామని తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు

- ఇంటి మధ్యలో పది అడుగుల మేర తవ్వకం
- రాళ్లు, మట్టి కనిపించకుండా ఇంటి చుట్టూ పాస్టిక్ కవర్లు

కోడ సత్తి ఇంట్లో గుప్త నిధుల కోసం తవ్విన గుంత

నందికొండ, జూలై 23 : గుప్త నిధుల కోసం ఓ ఇంట్లో ఏకంగా పది అడుగల మేర తవ్వకాలు చేపట్టిన ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. పది మంది కలిసి జట్టుగా ఏర్పడి అమావాస్య, పున్నమి రోజుల్లో తవ్వకాలు చేపడుతుండగా స్థానికుల ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీలోని పైలాన్‌కాలనీకి చెందిన కోడ మల్లి, కోడ శ్రీను, కోడ సత్తి, కోడ నాగ అన్నదములు సోదరులు. వారంతా ఎస్‌బీఐ వెనుక కాలనీలో వరుసగా నాలుగు ఇండ్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. కాగా, సత్తి ఇంట్లో కొద్ది నెలలుగా రాత్రిళ్లు తవ్వకాలు చేపడుతున్నారు. కోడ మల్లి ఆధ్వర్యంలో ఆయన సోదరులు, హైదరాబాద్‌కు చెందిన కొందరు, తవ్వడానికి మరికొందరు మొత్తం పది మంది ఒక గ్రూపుగా ఏర్పడి తవ్వుతున్నారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఎక్కువగా తవ్వేవారు. మిషన్లు కూడా వాడుతుండడంతో పెద్ద పెద్ద శబ్దాలు రావడం, నెలల తరబడి తవ్వకాలు కొనసాగుతుండడంతో భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ సంపత్‌గౌడ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, ఇంటి మధ్యలో పది అడుగుల లోతు కన్నా ఎక్కువ తవ్విన గుంత కనిపించింది. వచ్చిన మట్టి, రాళ్లు ఎవరికీ కనిపించకుండా మల్లి సోదరులు ఇంటి చుట్టూ ప్లాస్టిక్ కవర్లు కట్టారు. దాంతో పోలీసులు మల్లి సోదరులు, హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు, తవ్వడానికి వచ్చిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా, కోడ మల్లి సోదరులు మాత్రం పొంతన లేని సమాధానాలు చెప్తున్నారు. తమ ఇంట్లో ఎల్లమ్మ తల్లి ఉందని, ఇంట్లో గజ్జెల చప్పుడు వస్తుండడంతో తవ్వకాలు చేపట్టామని ఓసారి.. కుటుంబ సభ్యులను అనారోగ్య సమస్యలు ఇబ్బందులు పెడుతుండడంతో ఓ పూజారి చెప్పిన మేరకు తవ్వుతున్నామని మరోసారి తెలిపారు. మళ్లీ మాట మార్చి ఇంట్లో మరుగుదొడ్డి గుంతను తవ్వుతున్నామని చెప్పుకొచ్చారు.

విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

- రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి
- కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 23 : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చింతల శివ, లావుడియా రాజు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలో వస్తే వెంటనే స్కాలర్‌షిప్‌లు, పెండింగ్ ఫీజులు విడుదల చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఆరు నెలలు గడుస్తున్నా వాటిని పట్టించుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను చెప్పుకుందామంటే విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరమని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకపోతే రానున్న రోజుల్లో మంత్రులు, ఎమ్మెల్యేలను జిల్లాలో తిరుగకుండా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అదనపు కలెక్టర్ గంగాధర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కుక్కుట్ల శివాని, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, కాసుల నరేశ్, సహాయ కార్యదర్శి ఈర్ల రాహుల్, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, ఉదయ్, భవ్య, ఉదయ్, కార్తీక్, నేహాల్, భవాని, శంకర్ పాల్గొన్నారు